## క్లుప్తంగా

### అధిక రసాయనాలతో అనర్థాలు

**పెళ్లకూరు:** పంట సాగులో అధిక రసాయనాల వినియోగంతో అనర్థాలు ముంచుకొస్తాయని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఏడీఏ భాస్కరయ్య అన్నారు. మంగళవారం తాళ్వాయి పాడు, కానూరు గ్రామాల్లో ఆత్మ సహకారంతో వ్యవసాయ, ఉద్యాన శాఖలు సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నాయుడుపేట డివిజన్ ఉద్యానవన శాఖాధికారి శారద, ఏఓ వేణుగోపాలరావు, ప్రవీణ పాల్గొన్నారు.

### రైతులకు రాయితీతో డ్రోన్లు

**సూళ్లూరుపేట రూరల్:** ప్రభుత్వం రైతులకు రాయితీతో డ్రోన్లు అందజేస్తుందని ఏడీ అనిత తెలిపారు. సూళ్లూరుపేట మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆత్మ డీపీడీ శివనారాయణ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఓ కవిత తదితరులు పాల్గొన్నారు.

### విద్యా సామగ్రి పంపిణీ

**పెళ్లకూరు:** మండలంలోని పాలచ్చూరు గిరిజన కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు ఆట వస్తువులు, విద్యా సామగ్రిని చెంబేడు గ్రామానికి చెందిన రాజాశర్మ పంపిణీ చేశారు. హెచ్ఎం రవీంద్ర, వెంకటేశ్వర్లు, రామారావు, టీచర్లు బాలసుబ్రమణ్యం, కుమారి జోత్స్న, పీసీ చైర్‌పర్సన్ సుబ్బమ్మ పాల్గొన్నారు.

### రహదారి విస్తరణకు సర్వే

**నాయుడుపేట:** విశాఖపట్నం– చెన్నై ఇండస్ట్రీయల్ కారిడార్ అభివృద్ధిలో భాగంగా నాలుగు లేన్ల రహదారి నిర్మాణానికి తిమ్మాజికండ్రిగ, కొత్తపేట, పండ్లూరు గ్రామాల్లో మంగళవారం ఆర్ అండ్‌బీ, రెవెన్యూ అధికారుల ప్రత్యేక బృందం సర్వే చేసింది. ఈ సర్వేలో రైస్ సోషల్ ఎక్స్‌పర్ట్ పీ దేవరాజ్, ఆర్‌అండ్‌బీ డీఈ పరమేశ్వరి, ఉదయ్‌శంకర్, ఏఈ చిన్నరాయుడు పాల్గొన్నారు.

### మున్సిపాలిటీ అభివృద్ధికి చర్యలు

**వెంకటగిరిరూరల్:** మున్సిపాలిటీలోని 25 వార్డుల్లో మౌళిక సదుపాయాలు కల్పించి, అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరిలోని ఆయన నివాసంలో మంగళవారం మున్సిపల్ కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జీజీఎంపీ నిధులతో వార్డుల్లో మౌళిక సదుపాయాలు కల్పించాలన్నారు.అలాగే సెప్టెంబర్ 8వ తేదీన నిర్వహించనున్న జాబ్‌మేళాపై ప్రచారం చేయాలన్నారు.

### ఓటర్ల జాబితా తనిఖీ

**దొరవారిసత్రం:** మండలంలోని నెలబల్లి, అక్కరపాకలో ఓటర్ల జాబితాను మంగళవారం జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మృతి చెందిన వారి పేర్లు, బదిలీ అయిన వారి పేర్లు, డబుల్ ఎంట్రీలను పరిశీలించారు. తహసీల్దార్ గోపీనాథ్‌రెడ్డి, ఆర్ఐ ప్రవీణ్ రాయల్, వీఆర్వో జ్ఞానేంద్రం పాల్గొన్నారు.

### తొలగించిన ఓట్లపై విచారణ

**తడ:** మండలంలో తొలగించిన 1,286 ఓట్లకు సంబంధించిన వివరాలను నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు ప్రసాదరావు మంగళవారం పరిశీలించారు. మండల రెవెన్యూ కార్యాలయానికి వచ్చిన ఆయన తొలగింపు ఓట్లకు సంబంధించిన వివరాలను సేకరించారు.

### బహుమతుల పంపిణీ

**ఓజిలి:** మండలంలోని అత్తివరం ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు పద్యాలు, నాటక పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

### పల్లెల్లో సీసీరోడ్లు

**పెళ్లకూరు:** మండలంలోని పల్లెల్లో రూ. 2.60 కోట్లతో సిమెంట్‌రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు ఎంపీపీ శేఖర్‌రెడ్డి అన్నారు. మంగళ వారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయ న మాట్లాడుతూ త్వరలో నెలబల్లి, రోసనూరు, చిల్లకూరు, తాళ్వాయిపాడు, శిరసనంబేడు, పునబాక, అర్ధమాల, పుల్లూరు గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

### జిల్లా కలెక్టర్ విస్తృత పర్యటన

**గూడూరురూరల్:** ఓటర్ జాబితాల్లో పేర్ల తొలగింపునకు సంబంధించి గూడూరు నియోజకవర్గంలో జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి విస్తృతంగా పర్యటించారు. ఆయన వెంట ఆర్డీఓ ఎం.కిరణ్‌కుమార్, తహసీల్దార్ లీలారాణి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

**జిల్లా కలెక్టర్‌తో ఎమ్మెల్యే భేటీ**

ఓటర్ల జాబితాల తనిఖీకి గూడూరుకు వచ్చిన జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డిని ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు కలసి నియోజకవర్గంలో సమస్యలపై వినతిపత్రం అందజేశారు.

### ప్రజలు చంద్రబాబును నమ్మరు

**గూడూరు రూరల్:** రాష్ట్ర ప్రజలు చంద్రబాబును నమ్మే పరిస్థితిలో లేరని ఎమ్మెల్సీ మేరుగ మురళీధర్ మండిపడ్డారు. గూడూరులోని సనత్‌నగర్‌లో ఎమ్మెల్సీ నివాసంలో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ గత నాలుగున్నరేళ్లలో ప్రతిపక్ష స్థానంలో ఉండి ప్రశ్నించలేని వారు ఎన్నికలు దగ్గరపడడంతో డ్రామాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. టీడీపీ నుంచి టికెట్ కన్ఫామ్ అయ్యిందంటూ ఇప్పుడు ప్రజలు గుర్తుకు వచ్చారా అని ప్రశ్నించారు.

### ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

**గూడూరురూరల్:** క్రీడాకారులు ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అన్నారు. పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో క్రీడాదినోత్సవంనిర్వహించారు. ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై, కేక్‌ను కట్ చేసి క్రీడాకారులకు పంచిపెట్టారు. అనంతరం హాకీ లీగ్ పోటీలను నిర్వహించి, విజేతలకు ట్రోఫీలను అందజేశారు. బి.దీపక్ ఆకాష్ పాల్గొన్నారు.

# పల్లె ప్రగతికి ఆర్థిక సోపానం

గ్రామ వికాసంతోనే దేశ ప్రగతి సాధ్యం. ఈ నేపథ్యంలో పంచాయతీల అభివృద్ధి ఆవశ్యకతను ప్రభుత్వం గుర్తించింది. పల్లెల అభివృద్ధికి ఆర్థిక సహకారం అందించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసింది. ఫలితంగా పల్లె ప్రగతి బాట పయనించనుంది. ఆర్థిక సంఘం నిధుల విడుదలపై కథనం.

- పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం మంజూరు..
- గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు వినియోగం
- హర్షం వ్యక్తం చేస్తున్న సర్పంచ్‌లు



**15వ ఆర్థిక సంఘం నిధుల వివరాలు**

| | | |
|---|---|---|
| దక్కిలి మండలం | : | 3907630 |
| బాలాయపల్లి మండలం | : | 3314679 |
| వెంకటగిరి రూరల్ | : | 2684710 |

మాధవయ్యపాళెం గ్రామసచివాలయం

**దక్కిలి:** పంచాయతీల్లోని పల్లెల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులకు ప్రభుత్వం అధిక ప్రాధన్యం ఇస్తోంది. ఇందుకు అనుగుణంగా 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను 15వ ఆర్థిక సంఘం మొదట విడత నిధులను విడుదల చేశారు. ఈ నిధులతో పల్లెల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నారు.

**ఎప్పటికప్పుడు బిల్లు చెల్లింపు**

వెంకటగిరి నియోజకవర్గంలోని దక్కిలి మండలంలోని 27 పంచాయతీలకు రూ.39,07,630, బాలాయపల్లె మండలంలోని 24 పంచాయతీలకు రూ.33,14,679, వెంకటగిరి రూరల్ మండలంలోని 20 పంచాయతీలకు రూ.26,84,710 ఆయా పంచాయతీల పీడీ ఖాతాలకు జమకానున్నాయి. అయితే పంచాయతీల్లో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి అధ్వర్యంలోనే ఎప్పటికప్పుడు చెల్లింపులకు వీలుగా ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించారు. ఈ నిధులపై రాష్ట్ర ప్రభుత్వం పర్యవేక్షణ ఉటుంది. పంచాయతీల్లో వివిధ ఖర్చులకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గ్రామ స్వరాజ్య ఈ–పోర్టల్లో నమోదు చేయాల్సి ఉంటుంది. దీంతో లావాదేవీల వివరాలు సమాచారం ఎప్పటికప్పుడు పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులకు తెలుస్తోంది. ప్రభుత్వ ట్రెజరీ అనుమతులు, లేదా ఇతర ఉన్నతాధికారుల జోక్యం కూడా ఎక్కడా ఉండదని పంచాయతీ రాజ్ శాఖ ఉన్నతాధికారులు వెల్లడించారు.

**ఖర్చుకు విధి విధానాలివీ..**

పంచాయతీలకు జమ అయిన నిధులను టైడ్, అన్‌టైడ్ భాగాలుగా విడగొట్టి మొదట భాగంలో అంతర్గత రహదారులు, డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణం, కరెంట్ బిల్లులు చెల్లింపు, పంచాయతీ, అంగన్‌వాడీ, హెల్త్ సెంటర్, పంచాయతీ భవనాల అభివృద్ధికి వినియోగించుకోవాలి. వీటితోపాటు శ్మశాన వాటికల అభివృద్ధికి కూడా వినియోగించుకోవచ్చు. పంచాయతీ నిర్వహణకు కంప్యూటర్ విడి భాగాలు గొనుగోలు చేసేందుకు కూడా వినియోగించుకోవచ్చు. రెండో భాగంలో ప్రధానంగా తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం మెరుగు, చేతి పంపులు, నీటి ట్యాంక్‌లు, మోటార్ల నిర్వహణ బాధ్యతను ఆయా పంచాయతీలే చూసుకోవాలి. అవసరమైతే మరమ్మతులు చేయించాలి. 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదలతో పంచాయతీల సర్పంచ్‌లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**గ్రామాభివృద్ధికి ఎంతో ఉపయోగం**



15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామాలను మరింత అభివృద్ధి చేయవచ్చు. ముఖ్యంగా గ్రామంలో కొన్ని నెలలు నుంచి తాగునీటి పైపులైన్లు మరమ్మతులకు నిధులను వాడుకోవడంతోపాటు గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కరించుకోవచ్చు. గ్రామాల అభివృద్ధి కోసం నిధులను మంజూరు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు.

– మందాటి హైమావతి, సర్పంచ్, తూర్పుపల్లె(కేబీపల్లె)

**మార్గదర్శకాల మేరకే ఖర్చు**



15వ ఆర్థిక సంఘం నిధులు పంచాయతీ పీడీ ఖాతాలకు జమ చేయనున్నాం. ఈ నిధులకు సంబంధించి విడుదల చేసిన మార్గ దర్శకాల మేరకే ఖర్చు చేయాలి. ప్రాధాన్యత క్రమంలో సమస్యలు పరిష్కరించాల్సి ఉంది. ఈ నిధుల వినియోగాని సంబంధించిన బిల్లులను గ్రామస్వరాజ్య ఈ–పోర్టల్ నమోదు చేయాలి. అవినీతి జరిగితే సర్పంచ్, కార్యదర్శులపై చర్యలకు అవకాశం ఉంది.

– ప్రసన్నకుమారి, ఎంపీడీఓ, దక్కిలి

# ప్రతి ఇంట్లో సంక్షేమ సిరులు



రాపూరు: నవరత్నాల పథకాల ముగ్గును పరిశీలిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

**రాపూరు:** వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంట్లో సంక్షేమ సిరులు కురుస్తున్నాయని, దీంతో ప్రతి గడపలో తమకు విశేషాధరణ లభిస్తుందని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాపూరు మండలం సిద్ధవరం సచివాలయ పరిధిలో కోటూరుపాడు, బండేపల్లి, సిద్ధవరం బీసీ కాలనీలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో నేదురుమల్లికి మహిళలు మంగళహారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి ,సంక్షేమ పథకాల గుచించి వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బీ పట్టాభిరామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డీ నారాయణరెడ్డి, తిరుపతి పార్లమెంటు కమిటీ సభ్యుడు కే చెంచురామిరెడ్డి, వైస్ ఎంపీపీ పెంచలరెడ్డి, వ్యవసాయ సలహామండలి చైర్మన్ రవీంద్రారెడ్డి, రమణారెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, కే మధుసూదన్‌రెడ్డి, ఎం మధురెడ్డి, ప్రసాద్‌రెడ్డి, హరనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

**గడప గడపకు సంక్షేమ పథకాలు**



వెంకటగిరి రూరల్: బుక్‌లెట్ అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

**వెంకటగిరిరూరల్:** గడప గడపకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. వెంకటగిరి 22వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. నేదురుమల్లికి స్థానిక వార్డు కౌన్సిలర్, వైస్ చైర్మన్ ఉమామహేశ్వరి, మురళి దంపతులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ ప్రజలు పొందిన లబ్ధిని వివరించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్ భానుప్రియ, ఎస్ బాలయ్య, పార్టీ పట్టణ కన్వీనర్ జి ఢిల్లీ బాబు, విప్ పూజారి లక్ష్మి, ప్రముఖ న్యాయవాది ఎల్ కోటేశ్వరరావు, జిల్లా సంయుక్త సహాయ కార్యదర్శి సీ హరికృష్ణ, జేసీఎస్ కన్వీనర్ పీ ప్రసాద్‌రెడ్డి, నేతలు మురళి, సీహెచ్ యోగానందం, వీ గిరిబాబు పాల్గొన్నారు.

# లేగ దూడల పెంపకంతో అధిక ఆదాయం



లేగ దూడల శిబిరాన్ని ప్రారంభిస్తున్న జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ రవికుమార్

**గూడూరురూరల్:** లేగ దూడల పెంపకంతో పాడి రైతుల ఆదాయం పెరుగుతుందని తిరుపతి జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ ఎ.రవికుమార్ తెలిపారు. గూడూరు మండలంలోని విందూరులో మంగళవారం రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా జాతీయ కృత్రిమ గర్భధారణ కార్యక్రమంలో లేగ దూడల శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకం ద్వారా రైతులకు ముర్రా జాతి కుర్రలు, ఒంగోలు జాతి ఆబోతులు ఏడాది వయస్సు వాటిని రూ.20 వేలుకు చింతలదేవి పారం నుంచి అందిస్తామని చెప్పారు. కావాల్సిన వారు పశువైద్యాధికారులు సంప్రదించాలని తెలిపారు. పశుగణాభివృద్ధి సంఘం ఉప సంచాలకుడు డాక్టర్ టి.సోమయ్య, పశు సంవర్ధకశాఖ ఉప సంచాలకులు డాక్టర్ డి.ఉమామహేశ్వరి తదితరులు ప్రసంగించారు. అనంతరం మేలు జాతి లేగ దూడలను ఎంపిక చేసి, పాడి రైతులకు బహుమతులు అందజేశారు. సర్పంచ్ మస్తానయ్య, ఆర్బీకే చైర్మన్ పుష్పాల సుబ్రమణ్యం, గూడూరు ఏడీఏ డాక్టర్ బి.సురేష్, ఎంపీటీసీ సభ్యుడు బీ వెంకటరెడ్డి, పశువైద్యాధికారులు సుదర్శన్, ప్రభాకర్, పాల్గొన్నారు.

# విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



సైదాపురం: బహుమతి అందజేస్తున్న రిటైర్డ్ డీటీ

**సైదాపురం:** విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని విశ్రాంత డీటీ పెంచలయ్య కోరారు. సైదాపురం ఉన్నత పాఠశాలలో మంగళ వారం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా పలు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈకార్యక్రమంలో హెచ్ఎం ఎల్ నరసింహప్రసాద్, పీఏసీఎస్ మాజా అధ్యక్షుడు కె మోహన్‌రావు, ఉసర్పంచ్ బీ శివకుమార్, నాయకులు సాంబయ్య, సుధీర్, అనిల్, శ్రీధర్ ,వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

**రాపూరులో..**

**రాపూరు:** మండలంలోని వెటర్నరీ పాలిటెక్నికళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఇందిర తెలిపారు. అంతకు ముందు ర్యాలీ, ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆటల పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అధ్యాపకులు శ్రీహరి, చంద్రశేఖర్, విశాలి పాల్గొన్నారు.

**ఎన్‌బీకేఆర్‌లో..**

**కోట:** విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో మంగళవారం జాతీయక్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. పీడీ మల్లిఖార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

### స్థలం కేటాయించండి



మంత్రి రోజాతో మోహన్

**గూడూరురూరల్:** గాంధీనగర్‌లో హిందూ శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి ఆర్కే రోజాను మంగళవారం గూడూరుకు చెందిన వైఎస్సార్ సీపీ వికలాంగుల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు చల్లా మోహన్ కోరారు. నగరిలోని మంత్రి నివాసంలో ఆర్కే రోజాను కలిసి వినతిపత్రం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో దేగల రాము, మధు, సునీల్ ఉన్నారు.

### అధికంగా వినియోగించొద్దు

**వెంకటగిరిరూరల్:** పంటల సాగులో రైతులు అవసరానికి మించి అధికంగా ఎరువులు వినియోగించకూడదని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ భాస్కరయ్య తెలిపారు. మండలంలోని పెట్లూరులో ఆత్మ ఆధ్వర్యంలో రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ నాగార్జున సాగర్, ఇఫ్కో జిల్లా మేనేజర్ లక్ష్మినారాయణ, జిల్లా వనురల కేంద్రం ఏఓ వేణుగోపాలరావు, ఏఓ సుజాత పాల్గొన్నారు.

### బాలిక అదృశ్యంపై కేసు నమోదు

**నాయుడుపేటటౌన్:** దొరవారిసత్రం మండలం నెలబల్లి బంగ్లామిట్ట ప్రాంతానికి చెందిన 15 ఏళ్ల బాలిక బంధువులతో నాయుడుపేటకు వచ్చి అదృశ్యం కావడంపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు కథనం మేరకు.. ఈ నెల 26 తేదీన బాలిక బంధువులతో కలసి నాయుడుపేట వచ్చింది. తిరిగి గ్రామానికి వెళ్లేందుకు బస్టాండ్ వద్దకు వచ్చారు. కొద్ది సేపటికే బాలిక కనిపించకుండాపోయింది. పలు చోట్ల గాలించినా ఆచూకీ దొరకలేదు. బాలిక అవ్వ దేశమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### గుర్తు తెలియని వ్యక్తి మృతి



**చిల్లకూరు:** మండలంలోని ఓడూరు రాల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించి స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి వయస్సు 40 ఏళ్లు ఉంటుందని, కుడి చేతిపైన మమత అనే పేరు, రెండు చేతుల మీద హిందీ అక్షరాలు, లవ్ గుర్తు పచ్చ బొట్లు ఉంది. మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

### దరఖాస్తుల ఆహ్వానం

**వెంకటగిరిరూరల్:** పట్టణంలోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీ(ఐఐహెచ్‌టీ) కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ఓఎస్‌డీ ఎస్ గిరిధర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివరాలకు 9441795408 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

**బాల్య వివాహాలు అరికట్టాలి**

**వాకాడు:** మండలంలో బాల్య విహాలను అరికట్టాలని బాలరక్షా భారత్ సంస్థ కోఆర్డినేటర్ గీత అన్నారు. మంగళవారం వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు.

# తియ్యనైనది తెలుగుభాష



వెంకటగిరి రూరల్: గిడుగుకు నివాళులర్పిస్తున్న ప్రకాష్



రాపూరు: సంప్రదాయ దుస్తుల్లో చిన్నారులు



సైదాపురం: మహిళా మూర్తుల వేషధారణలో విద్యార్థులు

**వెంకటగిరిరూరల్:** తెలుగుభాష తియ్యనైనదని, అందరూ మాతృభాషను గౌరవించాలని 9వ బెటాలియన్ కమాండెంట్ పి ప్రకాష్ అన్నారు. మంగళవారం మండలంలోని వల్లివేడు 9వ బెటాలియన్‌లో తెలుగుభాషా వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. గిడుగు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అసిస్టెంట్ కమాండెంట్ ఆనంద్‌కన్నా, డీఎస్పీ రామ్‌కుమార్, డాక్టర్ శేషమ్మ, ఏఓ చంద్రమౌళి, ఆర్ఐ కె నందీశ్వరరావు, ఆర్ ఎస్ఐ రాజశేఖర్ పాల్గొన్నారు. అలాగే వెంకటగిరిలోని విశ్వోదయ డిగ్రీకళాశాలలో తెలుగుభాషా దినోత్సవం నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సుజాత, ఐక్యూ ఏసీ కో–ఆర్డినేటర్ యుగంధర్, తెలుగుశాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎల్ జ్యోతిశ్వర్‌నాయుడు పాల్గొన్నారు.

**కలువాయిలో..**

**కలువాయి:** మండలంలో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎంపీఎస్ ప్రసాద్, హెచ్ఎం సీహెచ్ లక్ష్మయ్య, తెలుగు ఉపాధ్యాయులు పద్మాకర్, లక్ష్మినారాయణ, సుప్రజ, మనోజ తదితరులు పాల్గొన్నారు.

**చిట్టమూరులో..**

**చిల్లకూరు(చిట్టమూరు):** మండలంలో జరిగిన కార్యక్రమాల్లో మల్లాం జెడ్పీ హైస్కూలు హెచ్ఎం శ్రీనివాసులు, టీచర్లు శేఖర్, సీహెచ్ పుష్ప పాల్గొన్నారు.

**పెళ్లకూరులో..**

**పెళ్లకూరు:** గిడుగు రామమూర్తి జయంతి సందర్భంగా మండలంలోని అన్నీ ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. హెచ్ఎం దొరస్వామి మునికృష్ణయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

**సూళ్లూరుపేటలో..**

**సూళ్లూరుపేట రూరల్:** మండలంలోని కోట పోలూరు జెడ్పీ హైస్కూలులో తెలుగు భాష దినోత్సవం నిర్వహించారు. ఉపాధ్యాయులు హజరత్‌బాబు, అంకయ్య, పీఈటి సన్నాయి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

**రాపూరులో..**

**రాపూరు:**మండలంలోని జరిగిన కార్యక్రమాల్లో హెచ్ఎం లీలాకుమార్, టీచర్లు మానస, గీత, షకీల,గౌస్ పాల్గొన్నారు.

**రోటరీక్లబ్ ఆధ్వర్యంలో..**

**సూళ్లూరుపేట:** రోటరీక్లబ్ వారి ఆధ్వర్యంలో మన్నారుపోలూరు జెడ్పీ హైస్కూల్‌లో తెలుగుభాషా వారోత్సవాలు నిర్వహించారు. రోటరీ అధ్యక్షుడు ఏ దశరథరెడ్డి, వినయ్‌సాగర్, రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు జ్యోతిలక్ష్మి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

**సైదాపురంలో..**

**సైదాపురం:** మండలంలోని జరిగిన కార్యక్రమాల్లో హెచ్ఎం నరసింహప్రసాద్, శిరిషా, శ్రీహరి, ఓబులమ్మ తదితరులు పాల్గొన్నారు.

**చిల్లకూరులో..**

**చిల్లకూరు:** మండలంలో జరిగిన కార్యక్రమాల్లో హెచ్ఎంలు శివసుబ్రహ్మణ్యం, స్వతంత్రకుమారి, బండ్ల సుధాకర్, సుబ్రహ్మణ్యంరాజు, ఉపాధ్యాయులు మాధవయ్య, ప్రజేంద్రరెడ్డి, శివరామిరెడ్డి, బాలచెన్నయ్య పాల్గొన్నారు. అలాగే చింతవరం జెడ్పీ హైస్కూలులో విద్యార్థులు అ, ఆ అనే అక్షరాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. అలాగే ఏరూరుకు చెందిన ఎనిమిదో తరగతి చదువుతున్న గిద్దలూరు దయాకర్, కృపాకర్ సైకత శిల్పాన్ని రూపొందించారు. విద్యార్థులను హెచ్ఎం శివసుబ్రహ్మణ్యం అభినందించారు.

**నాయుడుపేటలో..**

**నాయుడుపేట:** మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో తెలుగు భాష దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. పూడేరులో ప్రధానోపాధ్యాయులు ఇస్మాయిల్, తెలుగు టీచర్ రవికుమార్ పాల్గొన్నారు.

**తడలో..**

**తడ:** మండలంలోని పాఠశాల్లో తెలుగుభాషాదినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎన్‌బీకేఆర్ కళాశాల విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ మాలకొండయ్య, హెచ్ఎం సురేష్, తెలుగు ఉపాధ్యాయులు చెంగయ్య పాల్గొన్నారు.



విద్యార్థులు రూపొందించిన సైకత శిల్పం



చిల్లకూరులో విద్యార్థుల ప్రదర్శన



పెళ్లకూరు: కవయిత్రుల వేషధారణ



సూళ్లూరుపేట రూరల్: గిడుగుకు నివాళి



కలువాయిలో..



చిట్టమూరులో..






**శ్రీ విష్ణుమూర్తిసమేత**

**శ్రీ చెంచులక్ష్మి అమ్మవారి దేవస్థానము**

కొలితోట, అముదూరు గ్రామం, దక్కిలి మండలం, తిరుపతి జిల్లా.

**టెండరు ప్రకటన**

తిరుపతి జిల్లా, దక్కిలి మండలం, అముదూరు గ్రామం, కొలితోటలో వెలసియున్న శ్రీ విష్ణుమూర్తి సమేత శ్రీ చెంచులక్ష్మి అమ్మవారి దేవస్థానమునకు 2023–24 సం॥నకు క్రింద కనపరిచిన ఐటమ్‌లను సరఫరా చేయుటకుగాను తేది 2-9-2023 శనివారం మ॥ 4.00 గంటలకు కార్యనిర్వహణాధికారి, దేవదాయ – ధర్మదాయశాఖ అధికారుల సమక్షములో దేవస్థాన కార్యాలయమువద్ద సీల్డ్ టెండర్లు నిర్వహించబడును.

| వ. నెం. | టెండర్ వివరములు | ధరావత్తు | కాలపరిమితి | సీల్డ్ టెండర్ తేది మరియుసమయం |
|---|---|---|---|---|
| 1 | ఫలసరుకులు సరఫరా చేయుట | రూ. 10,000/- | 1-10-2023 నుండి 30-9-2024 వరకు | తేది 2-9-2023 శనివారం మ॥ 4.00 గం॥లకు |
| 2 | కూరగాయలు సరఫరా చేయుట | రూ. 5,000/- | | |
| 3 | పాలు, పెరుగు సరఫరా చేయుట | రూ. 2,000/- | | |
| 4 | పుష్పములు సరఫరా చేయుట | రూ. 2,000/- | | |
| 5 | ప్రింటింగ్ పనులు చేయుట | రూ. 5,000/- | | |
| 6 | వంటచెరకు సరఫరా చేయుట | రూ. 2,000/- | | |
| 7 | కరెంటు వస్తువులు సరఫరా చేయుట | రూ. 2,000/- | | |
| 8 | పూజా సామాగ్రి సరఫరా చేయుట | రూ. 2,000/- | | |

**షరతులు**

1. ఈ టెండర్లు శ్రీయుత కమీషనరు, దేవదాయ–ధర్మదాయ శాఖ, ఆంధ్రప్రదేశ్, గొల్లపూడి, విజయవాడ వారి అమోదపు ఉత్తర్వులకు లోబడి జరుపబడుచున్నవి.
2. టెండర్లలో పాల్గొనువారు ఆయా ఐటమ్‌లకు ఎదురుగా కనపరిచిన ధరావత్తును కార్యనిర్వహణాధికారి, శ్రీ విష్ణుమూర్తి సమేత శ్రీ చెంచులక్ష్మి అమ్మవారి దేవస్థానము, కొలితోట పేరిట తీయబడిన డి.డి. లేదా నగదు రూపములో మాత్రమే చెల్లించవలెను. (చెక్కులు స్వీకరించబడవు)
3. టెండరులో కోట్ చేసిన మొత్తము సరైనది కాదని భావించిన యెడల రేట్లను తగ్గించమని అడుగుటకు గాని, టెండరు నిలుపుదల చేయుటకుగాని, వాయిదా వేయుటకు గాని, రద్దు చేయుటకుగాని, మార్పు చేయుటకు గాని, కార్యనిర్వహణాధికారి గారికి అధికారము కలదు.
4. మిగిలిన వివరములు దేవస్థాన కార్యాలయము నందు అడిగి తెలుసుకొనవచ్చును.

అముదూరు గ్రామ పెద్దలు
తేది 21-8-2023

అరవభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి
కార్యనిర్వహణాధికారి